క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి సహకారం


అర్చకులతో మాట్లాడుతున్న పుట్ట మధు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పురాతన ఆలయం పునర్నిర్మాణం కోసం తనవంతుగా సహకారం అందిస్తానని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ఆదివారం శ్రీవేణుగోపాల స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాన్ని పునర్‌నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆదివరాహస్వామి ఆలయాన్ని నూతనంగా ఏర్పాటు చేస్తున్న రహదారి పనులు పరిశీలించారు. గ్రామంలోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ వెంట కిషన్ రెడ్డి, ఇనగంటి భాస్కర్‌రావు, కోలేటి చంద్రశేఖర్, రామారావు, నీలం శ్రీనివాస్, పిగుడు అంజి, రాసకొండ రవి తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా జనసేన


చెక్కు అందిస్తున్న శంకర్ గౌడ్

సుల్తానాబాద్: కార్యకర్తలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ అన్నారు. పట్టణంలోని ఆరేపల్లికి చెందిన చొప్పరి పవన్ కళ్యాణ్‌కు రూ. 2.5 లక్షల చెక్కు అందజేశారు. పార్టీ కార్యకర్త పవన్ కళ్యాణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, సమాచారం అందుకున్న శంకర్ గౌడ్ బాధితుడిని పరామర్శించి, చెక్కును అందజేశారు. అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, రాసూరి హరికృష్ణ దామోదర్, మూల హరీష్ గౌడ్, చల్లా శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ధ్యాన తరగతులు


ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న టీచర్

ఎలిగేడు: శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో రెండో రోజు శ్రీరామచంద్ర మిషన్ వారి సౌజన్యంతో విద్యార్థులకు ధ్యాన తరగతులను నిర్వహించారు. ధ్యానం వలన విద్యార్థులు ఒత్తిడి నుంచి బయటపడి చదువుపై శ్రద్ధ చూపడంతోపాటు మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్, అధ్యాపకులు రమేశ్, అనిల్, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన


ప్రశంసాపత్రం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కోల్‌సిటీ: మరణించి ఇద్దరి జీవితాల్లో వెలుగులు ప్రసాదించిన ఝాన్సీరాణి(63) అనే వృద్ధురాలు సజీవంగా బతికే ఉందని పలువురు కొనియాడారు. గోదావరిఖని జీఎం కాలనీకి ఝాన్సీరాణి క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవల మరణించగా, ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం వారి నివాసంలో, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు సంస్మరణ సభ నిర్వహించారు. ఝాన్సీరాణికి ఘనంగా నివాళి అర్పించారు. ఆమె కుటుంబీకులకు అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు సరళ, స్వరూప, కటాక్షం, మల్లయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీదేవి శోభాయాత్ర

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో ఆదివారం మార్వాడీ మహిళా సేవాసమాజ్ ఆధ్వర్యంలో గౌరీదేవి శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని ఎల్లమ్మ చెరువుకట్ట వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో 16 రోజులుగా పూజలందుకున్న గౌరీదేవిని పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుస్తామని మహిళాసేవాసమాజ్ సభ్యులు తెలిపారు.

నిరుపయోగంగా రైతు వేదికలు

- అసంపూర్తిగా టాయిలెట్స్
- నిధులున్నా పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న మహిళా రైతులు


మల్లాపూర్ లోని రైతువేదిక భవనం

ధర్మారం: రైతులకు సేవలందించడం కోసం నిర్మించిన రైతువేదికలు అస్తవ్యస్తంగా మారాయి. రైతువేదికల నిర్వహణను వ్యవసాయశాఖ అధికారులు గాలికి వదిలేయటంతో నిరుపయోగంగా మారాయి. ధర్మారం మండలంలో 29 గ్రామపంచాయతీలుండగా ఆరు క్లస్టర్ గ్రామాల్లో ప్రభుత్వం రైతువేదికలు నిర్మించింది. మండలంలోని మల్లాపూర్, కటికెనపల్లి, ధర్మారం, మేడారం, బొట్లవనపర్తి, దొంగతుర్తి గ్రామాల్లో రైతు వేదికల నిర్మాణాలు చేపట్టారు. ప్రతి క్లస్టర్ పరిధిలో నాలుగు నుంచి 5 గ్రామాలు వస్తాయి. అయితే కేవలం ధర్మారం, కటికెనపల్లి రైతు వేదికల్లో మినహా మిగతా నాలుగు రైతువేదిక భవనాలు అసంపూర్తిగా దర్శన మిస్తున్నాయి. మల్లాపూర్ రైతువేదిక వద్ద సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేయలేదు. గుంత తవ్వి వదిలేశారు. బొట్లవనపర్తిలో మంచినీటి వసతి ఉన్నప్పటికీ టాయిలెట్స్ పూర్తి చేయలేదు. దొంగతుర్తి, మేడారం రైతువేదికల్లో అన్ని వసతులు కల్పించినప్పటికీ నీటి వసతి ఏర్పాటు చేయలేదు.

కానరాని రైతు సమావేశాలు

ప్రతీ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే విధానాలను మేలైన విత్తనాలు, సస్యరక్షణ చర్యలు, సాగు విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని ఏర్పాటు చేసిన ఈ రైతు వేదికలు ఆచరణలో అమలు కావటం లేదు. అసలు సమావేశాలు ఎప్పుడు జరుగుతున్నాయో రైతులకు తెలియడం లేదు. నెలనెలా ఈ వేదికల్లో రైతులతో సంబంధిత అధికారులు సమావేశాలు ఏర్పాటు చేయాలి. కానీ రైతులకు తగు సమాచారం ఉండటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు సాగు చేసిన పంటలపై అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ఈ వేదికల్లో సంబంధిత ఏఈవోలు అందుబాటులో ఉంటున్నప్పటికీ రైతులు కానరావటం లేదు.

నిర్వహణకు నిధులున్నా...

ప్రతి రైతు వేదిక నిర్వహణ కోసం నెలనెలా ఒకొక్క రైతువేదికకు రూ.9 వేల రూపాయలు ప్రభుత్వం నుంచి కేటాయిస్తోంది. ఈ నిధులు ఏఈవోల ఖాతాల్లో నాలుగైదు నెలలకొకసారి జమచేస్తుంది. ఈ డబ్బులను రైతువేదికల్లో జరిగే సమావేశాలకు వచ్చే రైతులకు టీ, బిస్కట్స్‌తోపాటు ఇతర అవసరాలకు ఉపయోగిస్తారు.

సమావేశాలకు హాజరుకాని రైతులు

రైతువేదికల్లో నిర్వహించే సమావేశాలకు రైతులు హాజరుకావటం లేదు. మహిళా రైతులు సమావేశాలకు వస్తే కనీసం టాయిలెట్స్ సౌకర్యం లేకపోవడంతో మహిళా రైతులు సమావేశాలకు రావటానికి ముందుకు రావటం లేదు. ప్రారంభంలో సమావేశాలకు రావటానికి మక్కువచూపిన రైతులు రానురాను సమావేశాలకు రావటానికి శ్రద్ధ చూపించడం లేదు. దీంతో అధికారులు సైతం సమావేశాలు ఏర్పాటు చేయటం లేదు.

సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం



మండలంలోని ఆరు రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. ఆశించిన స్థాయిలో రైతులు సమావేశాలకు రావడం లేదు. ధర్మారం, కటికెనపల్లి రైతు వేదికల్లో మాత్రం అన్ని రకాల సౌకర్యాలున్నాయి. మిగతా నాలుగు రైతు వేదికలలో నీటి వసతి, టాయిలెట్స్ అసంపూర్తిగా ఉన్నాయి.

– పూర్ణిమ, మండల వ్యవసాయ అధికారి

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


మంత్రి కొప్పులను సన్మానిస్తున్న చైర్మన్

ధర్మారం: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుని పోటీపడి ర్యాంకులు సాధించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం రాత్రి బ్రిలియంట్ మోడల్ హైస్కూల్ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, సహకార సంఘాల జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వెల్గటూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎలేటి కృష్ణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు

ధర్మారం: మండలంలోని కొత్తూరులో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ.5 లక్షల నిధులను మంజూరు చేశారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తోడేటి స్వామికి ప్రొసీడింగ్ కాపీని అందించారు.కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు


బ్యాటింగ్ చేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు కోరారు. ఆదివారం విజ్జన్న క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. సుల్తానాబాద్ మండలంలో అనేకమంది క్రీడాకారులు ఉన్నారని, అందుకే క్రీడలకు పుట్టినిల్లుగా పేరుగాంచిందని పేర్కొన్నారు. ఓడిపోతే.. కారణాలు విశ్లేషించుకోవాలని, మరోసారి గెలిచేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఆటల ద్వారా మానసిక ఉల్లాసం, దృఢసంకల్పం కలుగుతుందని పేర్కొన్నారు. విజేత జట్టుకు రూ.20వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేలు అందిస్తామన్నారు. మినుపాల ప్రకాశ్‌రావు, సాయిరి మహేందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీశ్, ఎండీ.రఫీక్, చింతల రాజు, దున్నపోతుల రాజయ్య, పన్నాల రాములు, అమిరిశెట్టి రాయలింగు, కుమార్ కిశోర్, ఎండీ.మోబిన్, సిద్ధ తిరుపతి, అమిరిశెట్టి తిరుపతి, గాంధే రాజు, ఎండీ.షాహీం, ఎండీ.ఆసిఫ్, గడ్డం అనిల్, బండ తిరుపతి, టోర్నమెంట్ నిర్వాహకులు, నిట్టూరి రాజు, ఎండీ.సద్దాం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

శివుడి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: మహాశివుని అనుగ్రహంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని గుడి మిట్టపల్లిలో శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా 2 రోజు నిర్వహిస్తున్న హోమం,మహా రుద్రాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో శివాలయాన్ని పునర్ నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావడం శుభ పరిణామమని అన్నారు.రానున్న రోజుల్లో ఆలయాన్ని మహా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆ దేవదేవుడి పూజలను పొందే భాగ్యం కలుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమంలో భక్తులు 24 గంటల అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నగునూరి అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఐల రమేష్, కోశాధికారి అయిత రమేష్, మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, రైస్ మిల్లర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు,పట్టణాధ్యక్షుడు పారుపల్లి గుణపతి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ ఫక్కీర్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లిలో ఆదివారం పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడారు.బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, మళ్లీ బీఆర్ఎస్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో నాయకులు మర్కు లక్ష్మణ్, జెడ్పీటీసీ బండారు రామ్మూర్తి, విండో చైర్మన్లు చంద్రారెడ్డి, నర్సింహరెడ్డి, అనంతరెడ్డి, శంకరయ్య తదితరులున్నారు.

నియామకం

మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున్

సుల్తానాబాద్: సర్వాయి పాపన్న మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని నారాయణపూర్‌కు చెందిన వేగోళం మల్లికార్జున్ గౌడ్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కే వీరస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుండి నడవాలని కోరారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు మల్లికార్జున్ కృతజ్ఞతలు తెలిపారు.

మల్లిఖార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గా సంతోష్

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ధారవేని సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామంలో సమావేశం నిర్వహించి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సంతోష్, వైస్‌చైర్మన్‌గా ఆవుల లచ్చయ్య, ప్రధానకార్యదర్శిగా ధారవేని భూమయ్య,కోశాధికారిగా సది, సంగ లక్ష్మణ్ కార్యవర్గ సభ్యులుగా మద్రి కుమార్, దారవేని పోచయ్య, ముఖ్య సలహాదారుడిగా దారవేని ఓదెలును ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ 23వ డివిజన్ ఇన్‌చార్జిగా శంకర్ గౌడ్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా బుర్ర శంకర్ గౌడ్‌ను నియమిస్తూ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, బుర్ర శంకర్ గౌడ్‌కు నియామకపు పత్రాలను అందించారు. కార్యక్రమంలో తోడేటి శంకర్, పర్లపెల్లి రవీందర్, మెతుకు దేవరాజ్, నారాయణదాసు మారుతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా వేమారెడ్డి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు కాల్వ వేమారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా గుడ్ల నరేశ్, ప్రధాన కార్యదర్శి మేడి దేవేందర్, కోశాధికారి రాజయ్య, సహాయ కార్యదర్శి దాసరి శంకర్, కార్యవర్గ సభ్యులుగా ఇమ్మడి కృష్ణమూర్తి, కుమారస్వామి, సదానందం, ఓదెలు, శివయ్య, సంపత్, రాజేందర్, శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఈద నారాయణ రెడ్డి, గౌరవాధ్యక్షుడు సర్పంచు కొంకటి మల్లారెడ్డి, అర్చక పురోహితులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి, రొంపికుంట పరిధిలోని తెనుగుపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఉపాధిహామీ నుంచి రూ. 10 లక్షల నిధులు మంజూరు కావడంతో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శేవ్వ శంకరయ్య, వినోద, కిషన్‌రెడ్డి, లక్ష్మిమల్లు, చిందం తిరుపతి, సాయికుమార్, బొజ్జ సాగర్ పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం


ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రామగిరి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్డు వద్ద మంథని, పెద్దపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేపట్టి నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కండె పోశం, ఎంపీటీసీ కొప్పుల గణపతి, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రెండు మేకలు చోరీ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ ఎస్సీ కాలనీలో జంగం మహేందర్‌కు చెందిన రెండు మేకలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు తెలిపారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి దొంగలించుకుని పోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. వాటి విలువ రూ.25వేల వరకు ఉంటుందని తెలిపాడు.

మోటార్లు చోరీ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన మంచినీటి సరఫరా బావి మోటార్లు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. హుస్సేన్ మియా వాగు సమీపంలో ఉన్న 15 హెచ్‌పీ, 7.5 హెచ్‌పీ మోటార్లతోపాటు, రెండు స్టాటర్లు, వైర్లు, పైపులు, నాన్‌రిటన్ వాల్స్, హెయిర్‌వావల్స్, పానాలు సెట్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు సర్పంచ్ కొంకటి మల్లారెడ్డి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి స్థల విరాళం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చొరవ తీసుకున్నారని, నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని సర్పంచ్ తీగల సదయ్య తెలిపారు. ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు కొద్దిరోజుల క్రితమే యత్నించినా స్థల వివాదం కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. గ్రామానికి చెందిన ఆరెల్లి చినమల్లయ్య విరాళంగా స్థలాన్ని ఇచ్చేందుకు ముందుకు రావడంతో త్వరలో పనులు మొదలవుతాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బయ్య కొమురయ్య, ప్రభాకర్‌రావు, నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్, కనకయ్య తదితరులున్నారు.

శ్రీసీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

రామగిరి: శ్రీ సీతారాముల కల్యాణానికి రామగిరి, ముత్తారం మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆలయాలను ఆయా ఆలయకమిటీలు ముస్తాబు చేశారు. ఈ నెల 30 న నిర్వహించనున్న రాములోరి కల్యాణానికి వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కోసం చలువ పందిర్లు వేయించారు. రామగిరి మండలంలోని బుధవారంపేట, రాజాపూర్, నవాబ్‌పేట, రత్నాపూర్, పన్నూరు, సెంటినరీకాలనీ, కల్వచర్ల, ముత్తారం మండలంలోని ముత్తారం, అడవిశ్రీరాంపూర్, లక్కారం, కేశనపల్లి, ఖమ్మంపల్లి, సీతంపేట గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీరప్ప ఆలయ ఆవరణలో బోర్‌వెల్ ఏర్పాటు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లిలో బీరన్న ఆలయ ఆవరణలో ఆదివారం బోర్‌వెల్‌ను ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, బీఆర్ఎస్ నాయకులు వేయించారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బోర్‌వెల్ నిర్మాణం చేపట్టినట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా కురుమ సంఘం నాయకులు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సీనియర్ నాయకులు కల్లెం శ్రీనివాసరెడ్డి, బద్దం తిరుపతిరెడి బాసంపల్లి రాజేశం, పెద్ది సమ్మయ్య, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు నిరంకుశ పాలనకు నిదర్శనం


నగేశ్

ధర్మారం: కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ అన్నారు. ధర్మారంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు ఎందుకు వేశారో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ చర్య ప్రజాస్వామ్య విలువలకు గొడ్డలి పెట్టన్నారు. ప్రతిపక్షాలను బలహీనపర్చి తిరిగి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని భ్రమపడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ పద్ధతిని మార్చుకుని ప్రజాస్వామ్య బద్ధంగా పాలనను కొనసాగించాలన్నారు. సమావేశంలో లక్ష్మణ్, కిశోర్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ నవీన్ కుమార్

రామగిరి: మండలంలోని లొంకకేసారంలో సెంటినరీకాలనీలోని శ్రీకొండా లక్ష్మణ్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం)శిబిరం ఆదివారం ముగిసింది. వారంలో రోజుల పాటు గ్రామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు పూర్తి స్థాయిలో సహకారాలు అందించారని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. నవీన్ కుమార్, ఉప సర్పంచ్ ఒజ్జ ఓదెలు, పంచాయతీ కార్యదర్శి అమల, అధ్యాపక బృందం డాక్టర్ జి. చంద్రశేఖర్, డి. శృతి, షేక్ షరీఫ్, సిబ్బంది రవీందర్, రమేశ్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ కార్యాలయం మూగబోయింది. ఇటీవల అకాల వర్షం, రాళ్ల వర్షానికి సెల్ టవర్ దెబ్బతిందని అధికారులు చెబుతున్నప్పటికీ మరమ్మతులు చేపట్టక వారం అవుతోందని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని సెల్ టవర్ మరమ్మతు చేసి వినియోగదారులకు సేవలు అందించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల సాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో జర్నలిస్టుగా పనిచేసిన జనగామ నిరంజన్ ఇటీవల మరణించగా, బాధిత కుటుంబానికి నిరంజన్ పదో తరగతి బ్యాచ్ స్నేహితులు ఆదివారం రూ.72500 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మనోహర్, మస్రత్, హనుమాన్‌ప్రసాద్, కల్వల శ్రీనివాస్, శివప్రసాద్, కృష్ణమాచారి, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

సర్పంచ్‌కు సన్మానం

రామగిరి: మండలంలోని నాగేపల్లి గ్రామపంచాయతీ జిల్లా స్థాయి పంచాయతీ అవార్డును దక్కించుకున్నందుకు గాను ఆదివారం సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్‌ను గ్రామ యూత్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గద్దల శంకర్, చిట్టంపల్లి అనిల్ కుమార్, కొండవేన ప్రభాకర్ యాదవ్, తాళ్లపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి మైక్ సెట్ వితరణ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరేపల్లిలో పోచమ్మ ఆలయానికి ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏగోలపు సదయ్య గౌడ్ మైక్ సెట్ అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కూకట్ల రాయమల్లు, కొడగాని రాజేందర్,సంజీవ రావు, తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు కిందపడి కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

ఓదెల: రైలు కింద పడి కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడిన సంఘటన ఓదెల మండలం పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. పొత్కపల్లికి చెందిన కానిస్టేబుల్ షేక్ హమీద్‌పాషా పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని రామగిరి రైలులో పొత్కపల్లికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లడానికి పక్కనే ఆగి ఉన్న గూడ్సు రైలు బోగిల మధ్య నుంచి దాటుతుండగా రైలు అకస్మాత్తుగా కదిలింది. బోగిల మధ్య కాలు ఇరుక్కుపోవడతో కింద పడిపోయాడు. ఈ ఘటనలో కుడికాలు, కుడి చేయి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో సుల్తానాబాద్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు.

సమాచారం

నేడు ఎలిగేడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఎలిగేడు: మండలకేంద్రంలోని మధుర ఫంక్షన్‌హాల్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతారని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ దీక్ష..

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం దీక్ష నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు చిలుక సతీష్ కుమార్ తెలిపారు. దీక్షకు పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయ రమణారావు హాజరు కానున్నారని, కాంగ్రెస్ శ్రేణులు అత్యధిక మంది తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.